కథా నిలయం
6442
శ్రీకాకుళం

# 1

# సన్మానం

సాయంత్రం ఏడుగంటలయ్యింది. పగలంతా ఎండ మండిపోయి సాయంత్రం ఆరుగంటలకి మబ్బుపట్టి గాలిదుమారం మొదలైంది. ఇల్లు చేరుకున్న సూర్యం, "అమ్మయ్య వానొచ్చేలోగా ఇంటికొచ్చేశాను" అనుకున్నాడు.

భర్తని చూసి మంజుల కూడా ఊపిరి పీల్చుకుంది. హఠాత్తుగా వాన హోరున కురిస్తే రోడ్లన్నీ జలమయమై ట్రాఫిక్ స్తంభించిపోతే ఇల్లు చేరడం చాలా కష్టమైపోతుంది.

అతను బట్టలు మార్చుకుని వచ్చాక టిఫిన్ పెట్టి కాఫీ ఇచ్చింది. గాలి ఎక్కువై పోయింది. కరెంటు కూడా పోయింది. టి.వి. రాదు కాబట్టి ఇద్దరూ హాల్లో కూర్చున్నారు కబుర్లు చెప్పుకుంటూ.

దడదడమంటూ వర్షం మొదలయింది. అప్పుడే గేటు చప్పుడు. ఎవరో వచ్చిన అలికిడి. ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. ఆ కాలనీ ఇప్పుడిప్పుడే డెవలప్ అవుతోంది. ఇళ్ళు దూరదూరంగా ఉన్నాయి. దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి అప్పుడప్పుడు.

మెల్లిగా లేచాడు సూర్యం. "వద్దు వెళ్ళకండి. తలుపు తియ్యద్దు" అంటూ వారించింది మంజుల. "తలుపు తియ్యన్లే. కిటికీలోంచి చూస్తా" అంటూ టార్చిలైట్ తీసుకుని కిటికీ దగ్గరికి వెళ్ళి చూశాడు. ముందు చిన్న వరండా. దానికి కటకటాలు బిగించి వుంటాయి. దాని బయట నిలబడివున్నారు ఇద్దరు మనుషులు. భార్యాభర్తలే అని తెలిసిపోతోంది.

లైటుపడగానే కళ్ళు చిట్లించాడాయన.

"బయట వాన పడుతోంది. అందుకే ఇక్కడికొచ్చి నిలబడ్డాం. క్షమించండి. వర్షం తగ్గగానే వెళ్ళిపోతాం" అన్నాడాయన మొహమాటపడుతూ.

సరే అనేసి టార్చ్ తీసి లోపలికొచ్చి కూర్చున్నాడు. సూర్యం. అయిదు నిముషాలు గడిచింది.

వాన తగ్గలేదు సరికదా పెరిగింది. బయట జల్లుతో తడిసిపోతారు పాపం. గ్రిల్ తలుపు తీస్తే వరండాలో కూర్చుంటారు- అని లేచి టార్చ్ తీసుకువెళ్ళి మెయిన్ డోర్ తీసి గ్రిల్ తాళం తీశాడు.

అప్పటికే మోకాళ్ళపైదాకా తడిసిపోయారు వాళ్ళు.

"లోపలికి వచ్చి కూర్చోండి" అన్నాడు.

"వద్దులెండి. మీ ఇల్లంతా తడిసిపోతుంది" అన్నాడాయన మొహమాటంగా.

"ఫర్వాలేదు. రండి" అని బలవంతం చేశాడు.

తడిసిన బట్టలు గట్టిగా పిండుకుని చెప్పులు బయటే వదిలేసి లోపలికి వచ్చారు.

"కూర్చోండి" అని వరండాలో ఉన్న ప్లాస్టిక్ కుర్చీలు చూపించాడు. ఉస్సురంటూ అలసటగా కూర్చున్నారు ఇద్దరూ. గ్రిల్‌కి తాళంపెట్టి ఇంట్లోకి వెళ్ళి తలుపులేసుకున్నాడు. ఈ రోజుల్లో ఎవర్నీ నమ్మేట్టుగా లేదు. దొంగలు కూడా మాములుగానే వుంటున్నారు గానీ ఒంటికి ఆముదం రాసుకుని వుండడం లేదు. ఎవరి జాగ్రత్తలో వారు ఉండటం మంచిది.

మరో పది నిముషాలు గడిచాయి. కరెంటు వచ్చింది. వర్షం మాత్రం ఇంకా కురుస్తూనే వుంది.

వరండాలో లైటు వేసి, వాళ్ళేంచేస్తున్నారు ఓసారి చూద్దాం- అని లేచాడు సూర్యం. హాల్లోంచే వరండాలైట్ వేశాడు. తలుపు తియ్యబోతూ ఆగిపోయాడు. కిటికీ పక్కగా నిలబడి చూశాడు.

ఆయన చేతిలో ఒక బిస్కెట్ ప్యాకెట్. ఆవిడ చేతుల్లో మంచినీళ్ళ సీసా. రెండూ అడుగంటే వున్నాయి. ప్యాకెట్‌కు అడుగునవున్న రెండు బిస్కెట్లు తీసి భార్య కిచ్చాడు ఆయన.

"నా కొద్దు. మీరు తినండి" అందావిడ.

"నాకాకలి లేదు. నువ్వు తిను" అన్నాడు.

"ఎందుకు లేదూ ఆకలీ? మధ్యాహ్నం వాసూ వాళ్ళింట్లో తిన్న అన్నం. ఆ తర్వాత గుక్కెడు కాఫీ నీళ్ళు తాగారు. అదీ సాయంత్రం నాలుగింటికి. అవింకా కూర్చున్నాయా కడుపులో. మీరు తినండి" అంది.

"నువ్వా అంతేగా! నాకు ఆకలేసినా ఏం ప్రమాదం లేదు. నీకు చక్కెర రోగం. నీకు కళ్ళు తిరిగి పడిపోతే నేను పరుగులు పెట్టి చావలేను" అన్నాడతను.

"అది కాదండీ" అందావిడ.

"నీతో వాగి ఏడిచే ఓపికలేదు నాకు. ఇవి రెండూ తిను" అంటూ బలవంతంగా ఆవిడ నోట్లో పెట్టాడు.

ఆవిడకి కొరబోయింది.

ఒక గుక్కెడు నీళ్ళు తాగి తిప్పుకుంది. సీసాలో మిగిలిన గుక్కెడు నీళ్ళు నోట్లో పోసుకున్నాడాయన. ఇదంతా చూస్తున్న సూర్యం క్షణం ఆలస్యం చెయ్యలేదు. గిర్రున వెనక్కి తిరిగి "మంజూ మంజూ" అని కేకేశాడు. "ఏమిటీ?" అంటూ వచ్చింది మంజుల.

ఇంట్లో తినడానికి ఏవున్నాయ్? ఏదైనా సరే పట్రా!" అన్నాడు.

తెల్లబోయింది. "ఏమిటండీ ఏవిటీ హడావిడి?" అంది మంజుల.

"తీరిగ్గా చెప్తాను. వాళ్ళకు తినడానికి ఏదైనా ఏర్పాటు చెయ్యి" అనేసి ఫ్రిజ్ దగ్గరికి వెళ్ళి తలుపుతీసి ఒక నీళ్ళ బాటిల్ ఎదురుగా ఉన్న రెండు యాపిల్ పళ్ళూ గ్లాసులూ తీసుకుని పరుగెడుతున్నట్లుగా తలుపు తీసుకుని వరండాలోకి వెళ్ళాడు.

గ్లాసుల్లో నీళ్ళు పోసి "తీసుకోండి" అన్నాడు.

చల్లటి నీళ్ళు తాగి హమ్మయ్య అనుకున్నారు వాళ్ళిద్దరూ. యాపిల్‌పండు వాళ్ళకి ఇస్తూంటే "ఎందుకండి మీకు శ్రమ?" అన్నాడాయన.

"శ్రమేముంది. పండేగా తీసుకోండి" అన్నాడు సూర్యం. వాళ్ళిద్దరూ మొహమాట పడుతూనే వున్నారు.

లోపలికి వెళ్ళి ప్లేటు, చాకు తెచ్చి ముక్కలు కోసి పెట్టాడు సూర్యం. తీసుకోండి అని అందిస్తే మొహమాటంగానే తీసుకుని తిన్నారు వాళ్ళు.

ఆ మాత్రం ఆహారం కడుపులో పడేసరికి ఆ పెద్ద ప్రాణాలు కాస్త తేరుకున్నాయి.

"చెప్పండి. ఎవరు మీరు? ఎక్కడినించి వస్తున్నారు?" ఆదరంగా అడిగాడు సూర్యం.

చెప్పుకొచ్చాడు ఆయన. పేరు రాధాకృష్ణ. ఆవిడ ఆయన ధర్మపత్ని దుర్గ. వాళ్ళది పెదనందిపాడు దగ్గర కొమ్మూరు. ఆయన హరికథలు చెప్తాడు. కవి కూడా. పద్యాలూ, శతకాలూ కూడా రాశాడు.

ఇవిగాక భుక్తికోసం తెలుగులో పాఠాలు కూడా చెప్తాడు. ఇవన్నీ ఇప్పుడు కొత్తగా మొదలుపెట్టలేదు. గత యాభై ఏళ్ళుగా ఇదే పని.

"ఎంత సందెపొద్దునే లేచినా చింతగుంటపాలెం దగ్గరే తెల్లారిపోయింది"- అని సామెత చెప్పినట్లూ ఎన్ని పనులు చేసినా ఎంత కష్టపడినా తిండీ, బట్టా గడవటమే గగనంగా ఉంది.

అదృష్టవశాత్తూ పిల్లలు లేరు. ఉండుంటే వాళ్ళని పెంచి పెద్దచేసే భారం మొయ్యలేక చిప్ప చేతపుచ్చుకుని వీథినపడి అడుక్కుతినాల్సి వచ్చేది.

ఇన్నాళ్ళూ లేనిది ఇంత కాలానికి ఈయన గొప్పతనం ఎవరో గొప్పవారికి తెలిసింది.

వారు ఒక సంస్థ స్థాపించి అర్హులైనవారిని పిలిపించి సన్మానం చేస్తారు. ఈ ఏడాది ఇదుగో ఈయనని పిలిచారు. రానూ పోనూ ఖర్చులూ శాలువా, జ్ఞాపిక, ఇవిగాక అయిదువేల రూపాయల నగదూ.

ఈయన సంతోషం అంతా ఇంతా కాదు. తప్పకుండా వస్తానని అంగీకారం తెలియజేసి భార్యని వెంట బెట్టుకుని బస్సెక్కి వచ్చాడు. తెలిసినవాళ్ళెవరో వుంటే వాళ్ళింటికి వెళ్ళి స్నానం చేసి భోజనంచేసి సంచీతో సహా బయలుదేరి వచ్చేశారు.

సభ సాయంత్రం అయిదు గంటలకి. కొత్త చోటు. బోలెడంత దూరం అని మూడు గంటలకే బయలుదేరి వాళ్ళు బస్సెక్కిస్తే ఎక్కారిద్దరూ. వాళ్ళు చెప్పిన గుర్తుల ప్రకారం గమ్యం చేరుకున్నారు.

దరిద్రుడు తల కడిగితే వడగళ్ళవానట. అలాగే అయింది. ఆ సంస్థకు సంబంధించిన పెద్దాయన ఎవరో పోయాడట. సభ రద్దయిపోయింది. ఆ విషయం ఆ నిర్వాహకులు తెలియజేసే వుంటారు.

ఈయనకి సెల్‌ఫోన్ గట్రా లేదు మరి. అందుకే ఈయనకి కబురందలేదు. ఇలా ఎవరైనా వస్తే కబురందించమని ఇద్దరు పనివాళ్ళని సభాస్థలిలో ఉంచారు. వెళ్ళేసరికి ఇదీ సమాచారం. హతాశుడైపోయాడాయన.

మళ్ళీ మరో రోజు నిర్ణయించి ఈ కార్యక్రమం అప్పుడు జరుపుతారట. మరి దారిఖర్చులు ఇస్తారా అంటే ఏమో మాకేం చెప్పలేదు అన్నారు వాళ్ళు.

ఇంకెవరితోనో ఫోన్లో అడిగి తెలుసుకోండి అని బతిమాలితే, పాపం వాళ్ళు ప్రయత్నించారు గానీ అటు ఎవరూ దొరకలేదు.

తిరుగు ప్రయాణానికి బొటాబొటీగా డబ్బు తెచ్చుకున్నారు. సరే ఏం చేస్తాం? అనుకుని తిరుగుముఖం అయ్యారు. అక్కడినించీ సాయిబాబా కాలనీకి వెళ్ళి సిటీబస్సెక్కి మెయిన్ బస్టాండ్‌కి వెళ్ళాలి.

ఒక ఆటో దొరికితే ఎక్కారు. ఆ ఆటోవాడు ఇంకో సాయిబాబా కాలనీకి తీసుకొచ్చాడు. ఇదేవిటి అంటే "మరి ఏ సాయిబాబా కాలనీకి వెళ్ళాలో ముందే చెప్పాలి కదా! ఇటు తీసుకొస్తుంటే చూస్తూ ఎందుకూరుకున్నారు?" అని దెబ్బలాడాడు.

"మరి కొత్తవాళ్లకు ఎన్ని సాయిబాబా కాలనీలుంటాయో ఎలా తెలుస్తుంది?", అక్కడ దింపేసి, ఈ రోడ్డున తిన్నగా వెళ్తే బస్టాపు వస్తుంది. అక్కడ నిలబడితే మెయిన్ బస్టాండ్‌కి వెళ్ళే బస్సొస్తుంది" అని చెప్పి డబ్బులు పుచ్చుకుని వెళ్ళిపోయాడు ఆటో డ్రైవరు.

ఆ బస్టాపుదగ్గరే దింపమంటే కూడా వినిపించుకోలేదు. నేనిటు వెళ్ళాలి అనేసి తుర్రుమన్నాడు.

వీళ్ళిద్దరూ కాళ్ళీడ్చుకుంటూ నడుస్తూ వుంటే బస్టాపు రాలేదుగానీ గాలి దుమారం వచ్చేసింది. ఇదంతా చెప్పి ఎదుటిమనిషికి నమ్మకం కలగదేమోనని వెంట తెచ్చుకున్న సంచీలోంచి ఒక ఉత్తరం తీసి చూపించాడు.

"గౌరవనీయులు శ్రీ కొమ్మూరి రాధాకృష్ణశర్మగారికి వందనములు.

హరికథా ప్రక్రియలోనూ శతకకారుడిగానూ మీరు ఇన్ని సంవత్సరాలుగా సలుపుతున్న కృషిని గుర్తించి మీకు మా సంస్థ ద్వారా సన్మానం చేయ సంకల్పించాము. మీరు దయచేసి మేము నిర్వహించే కార్యక్రమానికి విచ్చేసి మమ్మానందింపజేయ గలరని ఆశిస్తున్నాము.

సభలో మీకు జ్ఞాపిక, శాలువా మరియు అయిదు వేల రూపాయల నగదు ఇచ్చి సత్కరింపగలము.

రానూ పోనూ ఖర్చులు బస్సుకిగానీ, రెండవ తరగతి రైలుకిగానీ మేమే భరించెదము (మీ ఒక్కరికే). వసతి మీరే ఏర్పాటు చేసుకోగలరు.

ఇట్లు

భవదీయుడు

భా. రా. రావు

కార్యదర్శి"

'ఇదండీ విషయం. ఏదో నాబోటి అనామకుడిని పిల్చి సన్మానం చేసేవారు ఉండటమే అదృష్టం అని సరే అని ఉత్తరం రాశాను. నాకు సన్మానం అంటే నేనూ వస్తా అని ఇదుగో ఈవిడా బయలుదేరింది.

అది కాస్తా ఇదుగో ఇట్లా తయారైంది. ఇదేమో మహానగరం. మేము "ఏ మూల ఉన్నామో బస్టాండు ఏ మూలనుందో తెలియదు. జల్లు తగ్గితే వెళ్ళి బస్సులో పడితే జన్మధన్యం" అన్నాడు దీనంగా.

ఆ ఉత్తరం మరోసారి చదివాడు సూర్యం.

"అరే! మీరు మా రాధాకృష్ణ మాస్టారా?" అన్నాడు సంభ్రమంగా, ఆయన ఆశ్చర్యపోయాడు.

"నేను మీకు తెలుసా?" అడిగాడు.

"భలేవారే. నేను మీ దగ్గర తెలుగు చదువుకున్నాను".

"నా దగ్గరా? ఎప్పుడూ? గుర్తు రావడం లేదే? నీ పేరు" అంటూ శిష్యుడు అనేసరికి ఏకవచన ప్రయోగంలోకి దిగిపోయాడాయన.

"నా పేరు సూర్యం. మేము మా నాన్నగారి ఉద్యోగ రీత్యా పెదనందిపాడులో ఉండేవాళ్ళం. తెలుగులో వెనకపడ్డానని మీ దగ్గర ప్రైవేటుకి పంపించారు నాన్నగారు" అని చెప్పాడు సూర్యం.

"ఏమో. మరి గుర్తు రావడంలేదే?" గుర్తు తెచ్చుకునేందుకు ప్రయత్నించాడు.

"భలేవారే మాస్టారూ, మీరూ! శిష్యులకి మాస్టారు గుర్తుంటారుగానీ మాస్టారికి శిష్యులంతా ఎలా గుర్తుంటారూ?" అన్నాడు సూర్యం.

"మీ నాన్నగారి పేరు నరసింహంగారు కదూ?" అడిగాడు ఆయన. "హమ్మయ్య గుర్తుపట్టేశారు" ఊపిరి పీల్చుకున్నాడు సూర్యం.

"ఓరోరి నువ్వుట్రా, ఎంతవాడివయ్యావు? చిన్నతనంలో నీకు 'ఞ' అక్షరం రాయటం వచ్చేది కాదు. ఓ రోజంతా దిద్దించాను గుర్తుందా?"

ఆయన మొహం వికసించింది. "ఎలా మర్చిపోతాను మాస్టారూ?" అని అన్నాడు సూర్యం.

అంతలోనే మంజుల వచ్చింది. "ఏవండీ చపాతీలు చేశాను. ఇక్కడికి తీసుకురానా" అని అడిగింది.

"ఇక్కడెందుకూ? లోపలికి వస్తాం" అన్నాడు సూర్యం. "రండి మాస్టారు. రండమ్మా" అంటూ ఇద్దర్నీ లోపలికి తీసికెళ్ళాడు సూర్యం.

"ఆ! సూర్యం ఇప్పుడేం చేస్తున్నావూ?" ఇందాక వరండాలోకి రావడానికే చాలా మొహమాటపడిన ఆయన, స్వతంత్రంగా డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు. శిష్యుడి ఇల్లేగా మరి!

చెప్పాడు సూర్యం.

"పిల్లలా నాయనా?" అడిగిందావిడ.

"ఇద్దరు పిల్లలు. అబ్బాయి ఇంజనీరింగ్ పూర్తిచేసి పై చదువులకోసం అమెరికా వెళ్ళాడు. అమ్మాయి మెడిసిన్ చదువుతోంది కాకినాడలో" చెప్పాడు.

"చాలా సంతోషం రా అబ్బాయ్. చక్కగా వృద్ధిలోకి వచ్చావు. పిల్లలూ చదువుకుంటున్నారు. శుభం" అన్నాడాయన తృప్తిగా. మంజుల చపాతీలూ, కూరా

వడ్డించింది. ఆకలిమీదున్నారేమో తృప్తిగా తిన్నారు. చనువుగా ఇల్లంతా చూసి ఆనందించారు.

బయట వర్షం తగ్గింది. "సూర్యం, మమ్మల్ని బస్టాండు దగ్గర దిగబెడతావా?" అడిగాడాయన.

"మెయిన్ బస్టాండ్‌కే తీసుకెళ్తాను మాస్టారూ. మిమ్మల్ని బస్సెక్కించి వస్తాను" అన్నాడు సూర్యం.

"మానాయనే. చీకట్లో ఎలా వెళ్తామో. కొత్తచోటు అని దిగులుపడుతున్నా. పైకి ఇదుగో, ఇలా గంభీరంగా కనపడతారేగానీ రాత్రిపూట మీ మాస్టారికి తిన్నగా కనబడదు" అందావిడ.

"అదేం లేదులేరా. మరి వయసుతోపాటు వచ్చిన అవలక్షణం అంతే. ఇదుగో ఈవిడకే రక్తపోటూ, చక్కెరా అన్నీనూ" అన్నాడాయన.

మరికాసేపు కబుర్లు చెప్పుకున్నారు అందరూ. చిన్నప్పుడు సూర్యం ఎంత అల్లరిచేసేవాడో చెప్పాడాయన. మంజుల ఎంతో సరదాపడిపోయింది ఆ కబుర్లు విని. ఇంకా చెప్పండి ఇంకా చెప్పండి... అని ఆసక్తిగా అడిగి మరీ చెప్పించుకుంది.

"ఇక బయలుదేరతాం. మళ్ళీ బస్సు దొరకాలిగా" అన్నాడాయన. అలాగే అంటూ లేచాడు సూర్యం.

"నేనూ వస్తాను పదండి" అంది మంజు.

గదికి వెళ్ళి బట్టలు మార్చుకుని బీరువాలోంచి రెండువేలు తీసి ఒక కవర్లో పెట్టాడుసూర్యం.

మంచంకిందవున్న ఓ సూట్‌కేసు బయటికి లాగి అందులో ఉన్న కొత్తచీరలు వెతికి వున్నవాటిల్లో మంచిది ఒకటి ఎంచింది మంజుల. తనూ తయారై బయటికి వచ్చి ఆవిడికి పసుపు కుంకుమపెట్టింది.

"అయ్యో! ఇవన్నీ ఎందుకు అమ్మాయ్ వద్దు అని మొహమాటపడిందావిడ. "పెద్దవారు. మా ఇంటికి అనుకోకుండా వచ్చారు. మామూలు చీరే" అని ఆవిడకి కాళ్ళకి దణ్ణం పెట్టింది. ఆ కవరు ఆయన చేతుల్లో పెట్టి నమస్కారం పెట్టాడు సూర్యం.

"ఎందుకురా నాయనా ఇవన్నీ?" అన్నాడాయన ఆ కవరు ఆప్యాయంగా నిమురుతూ. నిజానికి ఆయన ప్రాణం లేచివచ్చింది. సన్మానం జరగలేదు. డబ్బు రాలేదు. దారిఖర్చులకి డబ్బు ఖర్చయింది. ఇక నెల అంతా ఎట్లా గడపాలిరా దేవుడా అనుకున్నాడు. అటువంటి సమయంలో భార్యకి చీరెపెట్టి తనకూ పంచెలు పెట్టకుండా కవరు ఇవ్వడంతో గుండె మీదనించీ బరువు దించినట్లూ అయింది.

జాగ్రత్తగా లోపలి జేబులో దాచుకుని "దీర్ఘాయుష్మాన్‌భవ. ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధిరస్తు. ధన కనక వస్తు వాహన సమృద్ధిరస్తు. ఆచంద్రార్కం వంశాభివృద్ధి రస్తు" అని మనస్ఫూర్తిగా శిష్యుడిని దీవించాడు.

అందరూ కార్లో బయలుదేరారు. బస్టాండుకి వెళ్ళాక టికెట్లు తీసుకున్నాడు సూర్యం. ఆయన వారించినా వినలేదు. వాళ్ళని బస్సెక్కించి అరడజను అరటిపళ్ళు మంచినీళ్ళ సీసా కొని ఇచ్చాడు.

"సమయానికి దేవుడిలా కనిపించావురా సూర్యం. వీలు చూసుకుని మా ఇంటికి రా ఓసారి" అని తల నిమిరాడు ఆయన.

"అలాగే మాస్టారూ మరి వుంటా అని మరోసారి దణ్ణం పెట్టి బస్సు దిగాడు. కార్లో కూర్చున్నారు దంపతులు. బస్టాండు దాటి రద్దీ రోడ్డునించి ముందుకి వెళ్తూ కాస్త ఖాళీగా వున్న రోడ్‌మీదికి వచ్చాక మెల్లిగా అడిగింది మంజుల.

"ఏవండీ మీరు పెదనందిపాడులో వున్నట్టు నా కెప్పుడూ చెప్పలేదే? మామయ్యగారి పేరు నరసింహంగారేవిటీ? సుబ్బయ్యశాస్త్రిగారు కదా!" అడిగింది.

"థ్యాంక్స్ మంజూ" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"థ్యాంక్స్, ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగింది.

"అప్పుడే సందేహం వచ్చినా అడక్కుండా వాళ్ళు వెళ్ళేదాకా ఆగి ఇప్పుడు అడిగినందుకు".

"ఏదో కారణముంటేగానీ మీరు అలా చెప్పరుగా".

"నిజమే మంజూ. బలమైన కారణమే వుంది. ఆ వయస్సు, ఆ నిస్సహాయత, ఆ ఆత్మాభిమానం, ఆ దంపతుల్లో ఏ సుఖమూ అనుభవించకుండానే నన్నొదిలి

వెళ్ళిపోయిన అమ్మా నాన్న కనిపించారు. అందుకే పరాయివాడినంటే దూరంగానే ఉంచుతారని శిష్యుడినని అబద్ధం చెప్పి..." అంటుంటేనే అతని గొంతు బరువెక్కింది. వైపర్ ఆన్‌చేశాడు.

జాలిగా చూసి వైపర్ ఆఫ్‌చేసి భుజం మీద చెయ్యి వేసింది మంజుల. "జల్లుపడటంలేదు. కారు పక్కకి తీసి కాస్త స్థిమితపడండి" అంది.

అక్కడ బస్సులో ఆ పెద్దాయన సంతోషానికి పట్టపగ్గాలు లేవు. "మనకి పిల్లలు లేకపోతేనేం? శిష్యులున్నారు. ఆ సన్మానం జరగలేదని నాకేం బాధగా లేదు. ఈ సన్మానం ముందు అదెంత?" అని తల్చుకుని తల్చుకుని మురిసిపోతున్నాడు. ❑

*స్వాతి మాసపత్రిక, అనిల్ అవార్డు పొందిన కథ. అక్టోబర్ 2012*